సాక్షి మంచిర్యాల

బుధవారం । 25 । జూన్ । 2025



మెడికల్‌బోర్డు పిలుపు ఎప్పుడో!
నెలకోసారి నిర్వహించాల్సిన సింగరేణి కార్పొరేట్ మెడికల్ బోర్డు సమావేశాన్ని మూడు నెలలుగా నిర్వహించలేదు. దీంతో జబ్బుపడిన కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



కొమ్మలు కాదు.. చెట్లే నరికేశారు
విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు నరకడం సాధారణం. కానీ.. నెన్నెల మండల విద్యుత్‌శాఖ సిబ్బంది ఏకంగా 80 చింతచెట్లు కూల్చగా బాధితుడు ఫిర్యాదు చేశాడు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /27.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నలుగురికి పదోన్నతి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో వివిధ విభాగాల అధికారులకు కమిషనర్లుగా గత నెలలో ప్రమోషన్ కల్పించగా, మంగళవారం పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంచిర్యాల కార్పొరేషన్ మేనేజర్‌గా పని చేస్తున్న కే విజయ్‌కుమార్ ఆదిలాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా, మంచిర్యాల శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్ మంచిర్యాల కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా, మందమర్రి మున్సిపల్ మేనేజర్ కీర్తి నాగరాజు చొప్పదండి మున్సిపల్ కమిషనర్‌గా, మందమర్రి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీ శ్యాంసుందర్ తొర్రూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

బెల్లంపల్లి కమిషనర్‌గా రమేశ్
బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కే శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీడీఎంఏ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. భూపాలపల్లి మున్సిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న టీ రమేశ్‌కు పదోన్నతి కల్పించి బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇవ్వలేదు. సీడీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లక్సెట్టిపేట కమిషనర్‌గా సంపత్‌కుమార్
లక్సెటిపేట: లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ బదిలీ అయ్యారు. సీడీఎంఏలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హైదరాబాద్ సెక్రటేరియట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సంపత్‌కుమార్‌ను లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఆయన త్వరలో విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

విజ్ఞానాన్ని సంపాదించుకోవాలి



మాట్లాడుతున్న పురుషోత్తం నాయక్

కాసిపేట: సమాజంలో ప్రతి ఒక్కరికీ చదువు ముఖ్యమని, విద్యతో పూర్తి విజ్ఞానాన్ని సంపాదించుకుని జీవితంలో ఉన్నత స్థానంలో నిలువవచ్చని జిల్లా వయోజనవిద్య అధికారి, మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం నాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వయోజనవిద్యపై పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లతో సమావేశమై మాట్లాడారు. కాసిపేటను వందశాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. జిల్లా వయోజనవిద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాత్రి తరగతుల ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28న ఇప్పటివరకు చదువు నేర్చుకున్న వయోజనులకు ముత్యంపల్లి, ధర్మరావుపేట రైతువేదికల్లో పరీక్షలు, మూల్యాంకనం నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఇందుకు ఏర్పాట్లు చేసుకోవాలని, మండల స్థాయి అధికారులంతా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. తహసీల్దార్ భోజన్న, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, రిసోర్స్ పర్సన్లు బండ శాంకరి, కొండు జనార్దన్, సీనియర్ సహాయకుడు లక్ష్మీనారాయణ, ఏపీఎం వెంకటేశం పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్వో, ముగ్గురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు

దండేపల్లి: మండల కేంద్రానికి సమీపంలోగల కేజీబీవీలో విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేసిన ఘటనకు బాధ్యులైన ఎస్వో మంజుల, ముగ్గురు నాన్‌టీచింగ్ సిబ్బంది నీల, భారతి, లచ్చవ్వకు కలెక్టర్ కుమార్ దీపక్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఈవో దుర్గం చిన్నయ్య తెలిపారు. నోటీసులకు వారిచ్చే వివరణ ఆధారంగా ఉన్నతాధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే రైతు సంక్షేమం



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

బెల్లంపల్లిరూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కన్నాల రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు భరోసా సంబరాల కార్యక్రమానికి వినోద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రైతులను ఉద్దేశించిన సీఎం ప్రసంగించగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతును రాజుగా చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని తెలిపారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి సాగులో రాణించాలని సూచించారు. ఆర్డీవో హరికృష్ణ, ఏవో ప్రేమ్‌కుమార్, నాయకులు రాంచందర్, ప్రతాప్, సత్యనారాయణ, రవి, శ్రీనివాస్, స్వామి ఉన్నారు.

ఊరటనిచ్చిన వాన



నెన్నెలలో కురిసిన వర్షంతో ప్రాణం పోసుకున్న పత్తి మొలకలు

- మొలకలకు ప్రాణం పోసింది..!
- 9.4మి.మీ సగటు వర్షపాతం నమోదు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు కురిసిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షం రైతులకు ఊరటనిచ్చింది. వడలిపోతున్న మొలకలకు ప్రాణం పోసింది. జిల్లాలో కొద్ది రోజులుగా వర్షాలు కురవాల్సిన సమయంలో ఎండలు మండిపోయాయి. ఉదయం ఎండ సాయంత్రం మబ్బులు కమ్ముకుంటున్నా చిరుజల్లులకే పరిమితమైంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు వర్షం కురువగా.. జిల్లా సగటున 9.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముందస్తు వర్షాలతో పత్తి విత్తనాలు వేసుకోగా.. రెండు వారాలుగా వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మొలకలు వడలిపోతున్నాయని ఆందోళన చెందారు. రెండ్రోజులుగా మబ్బులు పడుతుండడంతో ఎండల నుంచి ఉపశమనం లభించింది. విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు, ఇప్పటికే విత్తనాలు వేసుకున్న వారికి వర్షం మేలు చేసింది. 17రోజుల తర్వాత జిల్లాలో 9.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరి విత్తనాలు అలికేందుకు, పత్తి, కంది, మొక్కజొన్న, పప్పు దినుసుల సాగుకు అనుకూలంగా వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం ఇప్పటివరకు 127.4మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా.. 57.2మిల్లీమీటర్లు కురిసింది. ఇంకా 55శాతం లోటు నెలకొంది.

మండలాల వారీగా నమోదైన వర్షపాతం

మండలం	భీమిని	కన్నెపల్లి	నెన్నెల	తాండూర్	వేమనపల్లి	కాసిపేట	బెల్లంపల్లి	చెన్నూర్	కోటపల్లి	జన్నారం	భీమారం	జైపూర్	మందమర్రి	నస్పూర్	మంచిర్యాల	హాజీపూర్	దండేపల్లి	లక్సెట్టిపేట
కురిసింది(మి.మీలలో)	39.3	31.9	19.8	12.2	11.7	8.8	8.4	6.1	5.9	2.5	4.6	3.9	3.6	3.6	3.1	1.3	1.1	0.9



ఈ చిత్రంలో తండ్రి సోలంకి అనిల్‌కుమార్ చంకనున్న ఐదేళ్ల బాలుడి పేరు విజయ్. వీరిది దండేపల్లి మండలం మేదరిపేట్. విజయ్‌కు 90శాతం మానసిక వైకల్యమున్నా దివ్యాంగుల పింఛన్ వస్తలేదు. అనిల్‌కుమార్ చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. వికలాంగుల సర్టిఫికెట్ గడువు ముగిసిపోగా రెన్యూవల్ కోసం ఎదురుచూస్తున్నాడు.



జన్నారం మండలం పొన్కల్ గ్రామానికి చెందిన చింతల కిష్టయ్య దివ్యాంగుడు. ఇతడు గతంలో తీసుకున్న వైకల్య నిర్ధారణ సర్టిఫికెట్ గడువు ముగిసిపోయింది. దీంతో మూడు నెలలుగా పింఛన్ రావడంలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాడు. మళ్లీ సర్టిఫికెట్ రెన్యూవల్ చేసుకునేందుకు ఎదురుచూస్తున్నాడు.

దివ్యాంగుల గోస!

- వైకల్య సర్టిఫికెట్ల జారీలో జాప్యం
- రిజిస్ట్రేషన్ చేసుకుని ఎదురుచూపు
- పింఛన్లు కోల్పోతున్న లబ్ధిదారులు

సాక్షిప్రతినిధి, మంచిర్యాల: దివ్యాంగులకు 'సదరం' గుర్తింపు పత్రం జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం తప్పనిసరైన దివ్యాంగ సర్టిఫికెట్ల కోసం జిల్లాలో వందలాది మంది వేచి చూస్తున్నారు. గతంలో మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని సదరం క్యాంపులకు హాజరయ్యేవారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యూడీఐడీ (విశిష్ట దివ్యాంగ గుర్తింపు) కార్డులు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యూడీఐడీ పొందేందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్నవారు తమ ఫోన్ నంబర్లకు సమాచారం వస్తేనే జిల్లా ఆస్పత్రికి పరీక్షల కోసం రావాల్సి ఉంటుంది. అయితే పరిమిత సంఖ్యలో స్లాట్స్ ఉండడంతో రెన్యూవల్ కోసం వందలాది మంది ఎదురుచూస్తున్నారు. ప్రతీ సోమవారం అనేక మంది దివ్యాంగులు తమకు పింఛన్ అందడం లేదని, ఇతర సంక్షేమ పథకాలు వర్తించడంలేదని ప్రజావాణిలో కలెక్టర్‌కు అర్జీలు ఇస్తున్నారు.



తప్పని నిరీక్షణ
మానసిక వైకల్యంతో పాటు శారీర లోపాలతో జిల్లాలో ఎంతోమంది బాధపడుతున్నారు. వీరిలో కళ్లు, కీళ్లు, ఎముకలు, మూగ, వినికిడితో బాధపడుతున్న వారికి స్థాయిని బట్టి నిపుణులైన వైద్యులు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. అయితే జిల్లాలో వేలాదిమంది దివ్యాంగ ధ్రువీకరణ పత్రాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అనేకమంది యూడీఐడీ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. కానీ.. స్లాట్ దొరకక నిరీక్షిస్తున్నారు. దీంతో వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో జాప్యం జరుగుతోంది. మరోవైపు తక్కువ వైకల్య శాతం ఉండి కూడా, కొందరు స్లాట్ బుకింగ్ చేయడంతో పరీక్షల అనంతరం అనర్హతగా గుర్తిస్తున్నారు. దీంతో అర్హులైన చిన్నారుల నుంచి పెద్దవయస్సు వారితో పాటు నిరుపేదలు పింఛన్‌పైనే ఆధారపడి జీవించే అనేకమందికి ఇబ్బందిగా మారింది. జిల్లా 'సెర్ప్' అధికారులు మాత్రం రిజిస్ట్రేషన్లు చేసుకున్నాక అందరికీ అవకాశం వస్తుందని.. వారికి నేరుగా సమాచారం అందుతుందని అప్పటిదాకా వేచి చూడాలని సూచిస్తున్నారు.

జిల్లాలో పెండింగ్ దివ్యాంగ అప్లికేషన్లు

మూడు నెలలుగా..	734
3నుంచి 6నెలలుగా..	340
ఆరునెలల పైబడి..	93
మొత్తం	1,167

దివ్యాంగ సర్టిఫికెట్లు పొందినవారు
17,771

పక్కాగా పోషకాహారం

- అంగన్‌వాడీల్లో ఫేస్ రికగ్నిషన్
- జూలై 1నుంచి అమలుకు చర్యలు
- అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే..



మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. వచ్చే నెల 1వ తేదీ నుంచి ఫేషియల్ రికగ్నిషన్ (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇప్పటికే లబ్ధిదారుల ముఖచిత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. జూలై 1నుంచి ఫేషియల్ రికగ్నిషన్ విధానం ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలోనే ఈ విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన ఫోన్లలో పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా ముఖ గుర్తింపు ప్రక్రియ అమలు చేసే విధానంపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు.

పంపిణీలో పారదర్శకత కోసమే..
ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారుల ఇంటికే వెళ్లి బాలామృతం, గుడ్లు పంపిణీ చేస్తున్నారు. చిన్నారుల తల్లుల ముఖచిత్రాలను యాప్‌లో నమోదు చేసుకుని సరుకులు అందిస్తున్నారు. వీరితో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారానికి కూడా వచ్చే నెల నుంచి ముఖ గుర్తింపును తప్పనిసరి చేయనున్నారు. ఈ విధానం ద్వారా పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలను నిరోధించవచ్చని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ భావిస్తోంది. జూలై 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో దీనిని అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా 969 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో మూడేళ్లలోపు చిన్నారులు 21,394 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 10,539 మంది, గర్భిణులు 3,528 మంది, బాలింతలు 3,381 మంది ఉన్నారు.

జిల్లాలోని అంగన్‌వాడీల సమాచారం

అంగన్‌వాడీ కేంద్రాలు	969
గర్భిణులు	3,528
బాలింతలు	3,381
మూడేళ్లలోపు చిన్నారులు	21,394
3–6 ఏళ్లలోపు చిన్నారులు	10,539

అమలుకు సిద్ధంగా ఉన్నాం



ఫేస్ రికగ్నిషన్ ద్వారా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి సరుకులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే పోషణ్ ట్రాక్ యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు నమోదు చేశాం. ఈ విధానాన్ని అమలు చేస్తే నేరుగా లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేసే అవకాశముంటుంది.
– రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమశాఖ అధికారి

స్టాప్–డయేరియా పకడ్బందీగా చేపట్టాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో స్టాప్–డయేరియా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో వైద్యారోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి స్టాప్–డయేరియా ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జూలై 31 వరకు నిర్వహించనున్న స్టాప్–డయేరియా కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అతిసార నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆహారం తీసుకునే సమయంలో తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు తల్లిపాలు తాగకపోవడం, వాంతులు అధికంగా కావడం, తరచూ మల విసర్జన, అనారోగ్యానికి గురికావడం, అపస్మారక స్థితికి చేరడం, జ్వరం ఉండడం, వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తదితర లక్షణాలుంటే వెంటనే సమీప ప్రభుత్వాస్పత్రి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు తీసుకువెళ్లి సరైన సమయంలో వైద్యసేవలు పొందాలని పేర్కొన్నారు. స్టాప్–డయేరియా కార్యక్రమంలో భాగంగా ఓఆర్ఎస్, జింక్ కార్నర్లు ఏర్పాటు చేయాలని, ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసారను నిర్మూలించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారులు కృపాబాయి, ప్రసాద్, సుధాకర్ నాయక్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం
భీమారం: రైతుల సంక్షేమ ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. భీమారం రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి రైతునేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమర్థవంతంగా రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతునేస్తం ద్వారా రైతులకు సాగులో మెళకువలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఏవో సుధాకర్, ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన
మండల కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్


మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు అర్హులందరికీ అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఉచిత ఇసుక సరఫరా, భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం, విత్తనాలు, ఎరువుల నిర్వహణ, వనమహోత్సం లక్ష్యసాధన, ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన, సీజన్ వ్యాధుల నివారణ చర్యలు, టీబీ ముక్త్ భారత్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందులో అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటికే మంజూరు పత్రాలు అందించినట్లు చెప్పారు. భారీ వర్షాలు ప్రారంభం కాకముందే లబ్ధిదారులు ఇండ్ల గ్రౌండ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాగుకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన మేరకు జిల్లాల వారీగా కేటాయించనున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా లాంటి విషజ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ఆవరణల్లో విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించేలా చూడాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి హరీశ్‌రాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి కిషన్, వ్యవసాయాధికారి కల్పన, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీ పాల్గొన్నారు.

కమిషనర్లకు కలిసిరాని చెన్నూర్

- మున్సిపాలిటీగా ఏర్పడి ఏడేళ్లు
- ఇప్పటికీ ఎనిమిది మంది బదిలీ
- కుంటుపడుతున్న పట్టణాభివృద్ధి

చెన్నూర్: కమిషనర్లకు చెన్నూర్ మున్సిపాలిటీ కలిసి రావడం లేదా? అంటే.. అవుననే చెప్పొచ్చు. చెన్నూర్ మున్సిపాలిటీగా ఏర్పడిన ఏడేళ్లలో ఎనిమిది మంది కమిషనర్లు బదిలీ అయ్యారు. ఇక్కడికి వచ్చిన కమిషనర్లు ఏడాది కంటే ఎక్కువ కాలం పని చేయకుండానే అర్ధంతరంగా బదిలీ అవుతుండడం గమనార్హం. తరచూ వీరి బదిలీల కారణంగా పాలన గాడి తప్పి, అభివృద్ధి కుంటుపడుతోంది.

అసలేం జరుగుతోంది?
చెన్నూర్ మున్సిపాలిటీ 2 ఆగస్టు 2018న ఏర్పడింది. మరో రెండు నెలలైతే ఏడేళ్లు పూర్తవుతుంది. ఏడేళ్లు పూర్తి కాకుండానే ఎనిమిది మంది కమిషనర్లు మారారు. మున్సిపాలిటీతోనే పట్టణాభివృద్ధి ముడిపడి ఉంది. ఏడాదికి ఒక్కరు చొప్పున కమిషనర్లు మారుతుండడంతో అభివృద్ధి ముందుకు సాగడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో విధులు నిర్వహించిన కమిషనర్ మురళీకృష్ణ గతేడాది అక్టోబర్ 27న చెన్నూర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. నవంబర్ 4న మున్సిపాలిటీ పరిధిలోగల పబ్లిక్ మోటర్లకు తాళాలు వేయడంతో పట్టణ ప్రజలతో పాటు అప్పటి పాలకవర్గం నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. నవంబర్ 27న పాలకవర్గానికి సమాచారం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని కమిషనర్‌పై అప్పటి పాలకవర్గ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత జనవరిలో మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పని చేస్తూ పాలనాపరమైన ఇబ్బందులు లేకుండా.. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా మున్సిపల్ కమిషనర్ అభివృద్ధిపై దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్ బదిలీ కావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.



చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయం

బదిలీ సహజమా?.. పనిష్మెంటా?
అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్న కమిషనర్ వచ్చి ఎనిమిది నెలలు కాకుండానే బదిలీ కావడాన్ని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇది సహజ బదిలీనా.. పనిష్మెంట్ బదిలీనా? అని గుసగుసలాడుతున్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సమర్థవంతంగా పని చేసే అధికారి ఉండాలనే ఉద్దేశంతో అధికార పార్టీ నేతలే బదిలీ చేయించారేమో? అనే చర్చసాగుతోంది.

త్వరలోనే కొత్త కమిషనర్
త్వరలోనే చెన్నూర్ మున్సిపల్ కమిషనర్‌గా అంజయ్య బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన చెన్నూర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.

గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- సీపీ అంబర్‌కిషోర్ ఝా
- గురుకుల విద్యార్థులకు అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా, డీసీపీ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

జైపూర్: గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. మత్తుపదార్థాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా జైపూర్ గురుకులంలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల దృష్టి భవిష్యత్, జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని తెలిపారు. నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు ఆకర్షితులు కావద్దని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత ప్రాంతమే లక్ష్యంగా పోలీస్ శాఖ కృషి చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా నిరంతరం విద్యాసంస్థలు, గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. చెడు స్నేహితులతోనే చెడు అలవాట్లకు గురవుతారని, తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు, వసతి గృహం ప్రిన్సిపాల్ విద్యార్థుల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని, ఎక్కడైనా గంజాయి సేవించినా, విక్రయించినా సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. గురుకులం, కేజీబీవీలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీలు వెంకటేశ్వర్, మల్లారెడ్డి, శ్రీనివాస్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, రాజ్‌కుమార్, ఎస్సైలు శ్రీధర్, శ్వేత, సంతోష్, గురుకులాల ప్రిన్సిపాల్‌లు నాగేశ్వర్‌రావు, రమేశ్‌బాబు, కేజీబీవీ ఎస్వో ఫణిబాల పాల్గొన్నారు.

మెడికల్ బోర్డు పిలుపు ఎప్పుడో..?

- 3 నెలలుగా నిర్వహించని సమావేశం
- సింగరేణి వ్యాప్తంగా 700 మంది నిరీక్షణ
- ఆందోళనలో హయ్యర్ సెంటర్ రిఫరల్ కేసు బాధితులు



శ్రీరాంపూర్: సింగరేణి కార్పొరేట్ మెడికల్ బోర్డు సమావేశం నిలిచిపోయింది. మూడు నెలలుగా బోర్డు సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో జబ్బుపడిన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలకోసారి మెడికల్ బోర్డు సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. కానీ 2025, మార్చి 21న నిర్వహించిన మెడికల్ బోర్డు మళ్లీ ఇప్పటి వరకు నిర్వహించలేదు. దీంతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులు నిరీక్షిస్తున్నారు. కంపెనీ నిబంధనల ప్రకారం ఏదైనా అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు ఇక తాము డ్యూటీలు చేయలేమని భావిస్తే మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకుంటారు. ఉద్యోగ విరమణ తేదీకి కనీసం రెండేళ్ల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కీళ్ల నొప్పులు, నడుం నొప్పులు, కిడ్నీ సమస్యలు, గుండె జబ్బులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల భారిన పడిన వారంతా కూడా బోర్డుకు దరఖాస్తు చేసుకుంటారు. దీంతో పాటు గనులు, బయట ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ఏరియా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని కూడా ఏరియా వైద్యాధికారులు కార్పొరేట్ మెడికల్ బోర్డుకు రెఫర్ చేస్తారు.

హయ్యర్ సెంటర్ రిఫరల్ కేసులు..

హయ్యర్ సెంటర్ రిఫరల్ బాధిత కార్మికులను హైదరాబాద్‌లోని నిమ్స్, ఇతర ప్రముఖ ఆస్పత్రులకు కంపెనీ రెఫర్ చేస్తుంది. ఇలా రిఫరల్ అయిన కార్మికులు అక్కడ చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్టును కంపెనీకి సమర్పిస్తారు. వారిని మెడికల్ బోర్డుకు పిలిచి వైద్యపరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేస్తారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన మెడికల్ బోర్డుకు ముందు మూడు నెలల నుంచి ఇలాంటి కేసులను బోర్డుకు పిలువలేదు. ఇలా ఆరు నెలలుగా హయ్యర్ సెంటర్ రిఫరల్ కేసులు పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో తాము వేతనాలు కోల్పోవాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు.

700 మంది నిరీక్షణ..

సింగరేణి వ్యాప్తంగా సుమారు 700 మంది కార్మికులు మెడికల్ బోర్డు పిలుపుకోసం ఎదురుచూస్తున్నారు. మెడికల్ బోర్డుకు వెళ్లిన కేసులను అక్కడి వైద్యబృందం, అధికారులు పరీక్షిస్తారు. వారికి ఉన్న జబ్బుల తీవ్రతను బట్టి అండర్ గ్రౌండ్‌లో పనిచేయలేని వారిని అన్‌ఫిట్ చేసి సర్ఫేస్‌లో డ్యూటీ ఇస్తారు. పూర్తిగా పని చేయలేరని భావించిన వారిని ఇన్వాలిడేషన్ చేస్తారు. దీని కింద కార్మికుని డిపెండెంట్లకు కారుణ్య ఉద్యోగం వస్తుంది.

సమావేశం నిర్వహించాలి

సింగరేణి యాజమాన్యం ఇకనైనా ఆలస్యం చేయకుండా వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలి. నెలకోసారి నిర్వహించాల్సిన బోర్డును ఇప్పటికీ మూడు నెలలుగా నిర్వహించకపోవడంతో వ్యాధుల భారిన పడిన కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
– కే.వీరభద్రయ్య, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకం పత్రం అందుకున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా సుగుణ



నియామకపత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆత్రం సుగుణ

టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ నియామకమయ్యారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంకులో తుపాకీ మిస్‌ఫైర్

- తప్పిన పెను ప్రమాదం
- ఆదిలాబాద్‌లో ఘటన



బుల్లెట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ చౌక్ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో తుపాకీ మిస్‌ఫైర్ అయ్యింది. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. పెను ప్రమాదం తప్పడంతో బ్యాంకుకు వచ్చిన వారు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఉదయం 10.15 గంటలకు బ్యాంకు నుంచి డబ్బులు బయటకు తీసుకెళ్లే సమయంలో గార్డ్ రాములు తుపాకీలో బుల్లెట్లు లోడ్ చేశాడు. పొరపాటున స్ట్రింగర్‌పై వేలు పడడంతో ఒక్కసారిగా తూటా బ్యాంక్ పైకప్పుకు తగిలింది. దీంతో అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందోనని ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో కొందరు ఖాతాదారులు మాత్రమే బ్యాంకులో ఉన్నారు. వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని సంఘటనపై ఆరా తీశారు.

క్లుప్తంగా

సోఫీనగర్ కాలనీలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ కాలనీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు కాలనీలో నివాసం ఉంటున్న బాబర్ సోమవారం రాత్రి కుటుంబంతో కలిసి ఇంట్లోనే నిద్రిస్తున్నారు. గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.12 వేల నగదు, ద్విచక్ర వాహనం అపహరించారు. ఉదయం లేచి చూసిన బాబర్ ఇంట్లో ఉన్న బ్యాగు, బైక్ కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాలుడు అదృశ్యం

సోన్: మండలంలోని మా దాపూర్ గ్రామానికి చెందిన బాలుడు అదృశ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరా ల మేరకు గ్రామానికి చెందిన నక్క రమేశ్ (15) ఈనెల 17న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం బాలుని తల్లి నక్క ఎల్లవ్వ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ కోర్సులో60, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో 60, కంప్యూటర్స్‌లో 60, మెకానికల్‌లో 60, మైనింగ్‌లో 60 మొత్తం 300 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో 150 సీట్లను సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలకు, 150 సీట్లు ఇతరులకు కేటాయించినట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగుల, మాజీ ఉద్యోగుల పిల్లలు జూలై 3 లోగా, ఇతరులు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9010222161, 8790112515 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పెళ్లి నిలిచిపోయిందని గొడవ

జైపూర్: పెళ్లి నిలిచిపోయి తమకు అన్యాయం జరిగిందని ఓ యువతి కుటుంబం ఓ యువకుడి కుటుంబంతో ఘర్షణ పడ్డారు. స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట యువతీ, యువకుల కుటుంబాల మధ్య మాటామాట పెరిగి కొట్టుకున్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి పెద్దపల్లి జిల్లా సుందిళ్లకు చెందిన యువకుడితో నిశ్చితార్థం జరిగింది. ఒప్పందం ప్రకారం అమ్మాయి కుటుంబం కట్నం కొంత చెల్లించగా.. అబ్బాయి కుటుంబం మరింత కట్నం ఆశించడం, పెళ్లి ఏర్పాట్లలో చోటు చేసుకున్న సంఘటనలతో అబ్బాయి పెళ్లికి నిరాకరించాడు. దీంతో పెళ్లి ఆగిపోయింది. పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించగా.. ఇరువర్గాలు సోమవారం పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోవడానికి పోలీసులు సమయం ఇచ్చారు. అబ్బాయి వైపు పెద్ద మనుషులు డబ్బులు తీసుకుని అమ్మాయికి అ న్యాయం చేసే విధంగా మాట్లాడారని, తమకు జరిగిన అన్యాయంపై ఎవరూ మాట్లాడడం లేదని వాదించడం వారి మధ్య గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో ఒకరిపైనొకరు చేయి చేసుకున్నారు.

బ్రాండెడ్ పేరిట రాయితీ బియ్యం విక్రయం

- ముగ్గురు వ్యాపారులపై కేసు
- పరారీలో ఒకరు



రాయితీ బియ్యం పరిశీలిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: బ్రాండెడ్ రైస్ పేరుతో ప్రభుత్వ రాయితీ బియ్యం విక్రయిస్తున్న ఘరానా ముఠాను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఎస్పీకి అందిన సమాచారం మేరకు జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో దుకాణాలను తనిఖీ చేయగా ఇద్దరు వ్యాపారుల వద్ద 80 క్వింటాళ్ల రాయితీ బియ్యం బ్రాండెడ్ బ్యాగుల్లో వేసి ప్రజలకు విక్రయిస్తున్నట్లు గుర్తించి ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. శివాజీ చౌక్‌లోని రజిత కిరాణంకు చెందిన గాగుల్వార్ రాజేశ్వర్, ఆంధ్ర కిరాణంకు చెందిన షేక్ అయ్యూబ్‌లను అరెస్టు చేశారు. చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ అస్లమ్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. మార్కెట్లో మంచి బ్రాండ్‌గా ఉన్న జై శ్రీరామ్, గోల్డెన్, సైకిల్‌బ్రాండ్, సూర్యతేజ, మధురం, దీపం, గీతాంజలి, వైట్‌ప్లాటినం, శ్రీదత్త అనే పేర్లతో ఉన్న ఖాళీ సంచుల్లో పీడీఎస్ రైస్ నింపి మిషన్‌తో సీల్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపులతో యువకుడు ఆత్మహత్య

- వ్యాపారి ఇంటి ఎదుట బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు



రాజశేఖర్ (ఫైల్)

పెంచికల్‌పేట్: వ్యాపారి వేధింపులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అగర్‌గూడలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన తుమ్మిడే రాజశేఖర్ (22) కొంతకాలంగా ఎల్కపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి కృష్ణ ఎరువుల దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. తన సోదరి డెలివరీకి ఉండగా నాలుగురోజుల పాటు దుకాణానికి వెళ్లలేదు. సోమవారం విధులకు హాజరుకావడంతో కోపోద్రిక్తుడైన వ్యాపారి తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు డబ్బులు దొంగిలించాడని హేళనగా మాట్లాడాడు. బాకీ ఉన్న రూ.10వేలు ఇవ్వాలనగా ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అంతేకాకుండా కేసు పెడతానని ఫోన్‌లో కుటుంబ సభ్యులను బెదిరించడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అగర్‌గూడ సమీపంలోని పంట చేనులో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా కాగజ్‌నగర్, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి లక్ష్మి కన్నీరుమున్నీరవుతోంది. ఘటనకు కారకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వ్యాపారి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై కొమురయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

పైచదువులు ఇష్టంలేక విద్యార్థి ఆత్మహత్య



తరుణ్‌గౌడ్(ఫైల్)

దండేపల్లి(మంచిర్యాల): పై చదువులు ఇష్టంలేక ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దండేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పొన్నం చంద్రగౌడ్, మాధవి దంపతుల కుమారుడు పొన్నం తరుణ్‌గౌడ్ (18) ఇంటర్ పూర్తి చేశాడు. బీటెక్ చదవాలని తండ్రి సూచించడంతో నాకు పైచదువులు ఇష్టం లేదని, ఏదైనా వ్యాపారం చేసుకుంటానని చెప్పాడు. అయితే బీటెక్ అయ్యాక వ్యాపారం చేసుకొమ్మని తండ్రి నచ్చజెప్పాడు. ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లి కొన్ని బీటెక్ కాలేజీలు కూడా చూసివచ్చారు. అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గదిలో ఉన్న తరుణ్‌ను భోజనానికి పిలిస్తే రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లిచూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి చంద్రగౌడ్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ ఇష్టంలేక ఒకరు..



గంగాధర్ (ఫైల్)

లోకేశ్వరం(ముధోల్): మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బిలోలిలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓల్‌కర్ బీరన్న-రాంబాయి దంపతుల కుమారుడు గంగాధర్ (17)నిర్మల్ పట్టణంలోని బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ఇటీవల పదోతరగతి పూర్తి చేశాడు. ఇంటర్ చదివేందుకు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో అప్లై చేసుకున్నాడు. అయితే హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తానని, ఇంటర్ చదవనని చెప్పడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం తమ పంటచేనులో మద్యం సీసాలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..



రవీంద్రనాథ్ (ఫైల్)

సిరికొండ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీసాయి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రనికి చెందిన దొండే రవీంద్రనాథ్ (48) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..



సురేశ్ (ఫైల్)

కడెం: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దూర్‌తండాకు చెందిన హపవత్ సురేశ్ (22) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో పెద్దూర్ సమీపంలోని ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుని తల్లి అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

తానూరు: ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ట్రైయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. హిప్నెల్లితండాకు చెందిన రాథోడ్ అశ్విన్ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండగా అందులో ప్రయాణిస్తున్న రాథోడ్ గురుజీ, సునీల్ గొడవపడ్డారు. వారిని ఆటోలోంచి దిగిపొమ్మనడంతో ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడ్డారు. గాయాలు కావడంతో అశ్విన్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధితుని తల్లి అంజనాబాయి ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి

భీమారం(చెన్నూర్): మండలంలోని దాంపూర్ సమీపంలో సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు మేకల కొమురయ్య, నాంపల్లి సుగుణకు చెందిన రెండు గేదెలు అడవికి మేతకోసం వెళ్లాయి. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం వెతుకుతుండగా గ్రామ పొలిమేరలో మృతి చెంది కనిపించాయి. పంటపొలాలకు విద్యుత్ సరఫరా చేసే తీగ తెగి కిందపడటంతో అదేమార్గం గుండా వచ్చిన గేదెలు తీగను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. గేదెల విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని పశువైద్యాధికారి రాకేశ్‌శర్మ సందర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్‌హెచ్‌ఎం విభాగం నందు యూపీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న రెండు మెడికల్ ఆఫీసర్ పోస్టులు, ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్‌లో ఎంఎల్‌హెచ్‌పీలో రెండు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఎంబీబీఎస్, ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు ఎంబీబీఎస్/బీఏఎంఎస్ అర్హత ఉండాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 26న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

బాలికను వేధించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్సై బి.సుశీల తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడకు చెందిన జాదవ్ కృష్ణ ఓ బాలికకు ప్రతీరోజు రూ.10 ఇచ్చి చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తూ లైంగికంగా వేధిస్తున్నాడు. షీటీమ్ బృందం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి వివరిస్తున్న సందర్భంలో తనకు జరిగిన అన్యాయాన్ని సదరు బాలిక షీటీమ్ బృందానికి తెలియజేసింది. కుటుంబ సభ్యులకు వివరాలను వెల్లడించడంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై..

తానూరు: ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలకు ఇచ్చిన భూమి తనదేనంటూ లబ్ధిదారులను బెదిరించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. బామ్నితండాకు చెందిన పోశెట్టి గతంలో ప్రభుత్వానికి 3.33 ఎకరాల భూమిని విక్రయించాడు. అట్టి భూమిని ప్రభుత్వం లబ్ధిదారులకు పంచింది. అందులో ఇంటి నిర్మాణానికి స్థలాన్ని చదును చేసుకుంటుండగా పోశెట్టి కుమారుడు కిష్టయ్య ఆ భూమి తమదేనంటూ లబ్ధిదారులను బెదిరించాడు. బాధితులు తహసీల్దార్ లింగంమూర్తిని ఆశ్రయించడంతో రికార్డులు పరిశీలించి కిష్టయ్యపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేధించిన కేసులో మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను వేధించిన కేసులో ఒకరికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.4వేల జరిమానా విధిస్తూ జిల్లా అదనపు జడ్జి డాక్టర్ శివరాంప్రసాద్ మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. బేల గ్రామానికి చెందిన బాలికకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సాగర్ శరత్ మొబైల్ ఫోన్‌లో వాట్సాప్ కాల్ చేసాడు. ఆ స్క్రీన్‌షాట్‌ను తిరిగి బాలికకు వాట్సాప్ ద్వారా పంపించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. బాలిక విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో 2023 ఏప్రిల్ 15న బేల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై బి.కృష్ణ కుమార్ కేసు నమోదు చేయగా కోర్టుడ్యూటీ అధికారి శ్రీనివాస్ పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ ప్రవీణ్ కుమార్ నేరం రుజువు చేశారు.

ఏటీఎంలో చోరీ కేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో సంచలనం సృష్టించిన ఏటీఎంలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన ఐదుగురు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ రవికుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన జేసీబీ ఆపరేటర్లు మహ్మద్ ముస్తాఫా, షాహీద్, వారి సహచరులైన ఆలీంఖాన్, సాజిద్, అఫ్తాబ్‌తో కలిసి ఏటీఎంలోకి వెళ్లి మిషన్ క్యాషెట్‌ను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేశారు. అంతలోనే పోలీస్ సైరన్ వినిపించడంతో క్యాషెట్‌ను (రూ.30వేల)ను పట్టుకెళ్లారు. ఏటీఎం నిర్వహాకులు సీఎంఎస్ కంపెనీకి చెందిన అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్ ఫిర్యాదుతో బెల్లంపల్లి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం బెల్లంపల్లి కెమికల్ ప్రాంతంలో మహ్మద్ ముస్తాఫా, షాహిద్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, గ్యాస్ కట్టర్, గ్యాస్ సిలిండర్‌తో పాటు ఏటీఎంలోని క్యాషెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆలీంఖాన్, సాజిద్, అఫ్తాబ్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితులు మహారాష్ట్రలోని అహేరిలో పల్సర్ బైక్, మంచిర్యాలలో షైన్ బైక్‌ను దొంగలించారు. కాగజ్‌నగర్‌లో గ్యాస్ కట్టర్, కొటాలలో గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేశారు. కేసును ఛేదించిన బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై కే.మహేందర్, నెన్నెల ఎస్సై ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ సాయికృష్ణ, హోంగార్డు సంపత్‌ను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక రైలు

నిర్మల్‌చైన్‌గేట్: తీర్థయాత్రలకు వెళ్ళే భక్తుల కోసం జూలై 5 నుంచి 13 వరకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైలు ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్ జీవీ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగపూర్‌కు జూలై 5న యాత్ర ప్రారంభమై 13 వరకు కొనసాగుతుందన్నారు. ఇందుకోసం ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.14,700, థర్డ్ ఏసీ ధర రూ.22,900, సెకండ్ ఏసీ ధర రూ.29,900 ఉంటుందన్నారు. యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముద్ఖేడ్, పూర్ణ మీదుగా వెళ్తుందన్నారు. ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్‌తో పాటు ఆయా రైల్వే స్టేషన్‌ల నుంచి దేవాలయాల వరకు ప్రయాణం పూర్తిగా ఉచితమన్నారు. ప్రతీ 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకూరుస్తారన్నారు. ఆసక్తి కలవారు 9701360701, 9281495843, నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొమ్మలు కాదు.. చెట్లే నరికేశారు..!

- విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని..
- ఫిర్యాదుపై పట్టించుకోని అధికారులు
- ప్రజావాణిలో మూడుసార్లు ఫిర్యాదు



నరికిన చింతచెట్ల వద్ద బాధితుడు మహేశ్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు విద్యుత్ శాఖ సిబ్బంది కొట్టేస్తుంటారు. జిల్లాలోని నెన్నెల మండల విద్యుత్ శాఖ అధికారులు ఏకంగా 80 చింతచెట్లు కొట్టేయించారు. దిగుబడి వచ్చే చెట్లను కొట్టేయడంపై బాధితుడు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నెన్నెల మండలం వెల్లంపల్లికి చెందిన ముడపల్లి మహేష్‌కు భీమారం మండలం కాజిపల్లి శివారు సర్వేనంబరు 94/1లో 4.12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. చుట్టూ 2015లో 90 చింతచెట్ల మొక్కలు నాటి పెంచుతున్నాడు. రెండేళ్లుగా చింతపండు దిగుబడి వస్తోంది. గత ఏడాది రూ.70వేలు ఆదాయం వచ్చింది. భవిష్యత్‌లో మంచి లాభాలు వస్తాయని ఆశిస్తే విద్యుత్‌శాఖ అధికారులు అడియాసలు చేశారు. నెన్నెల మండల విద్యుత్ శాఖ అధికారులు 2025 మే 5న వెంకటపూర్, కొత్తూర్‌కు కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటుకు అడ్డుగా ఉన్నాయని 80 చెట్లు నరికేశారు. కొమ్మలు అడ్డుగా ఉంటే నరికేస్తారు. కానీ ఇక్కడ చెట్లే నరికేయడం గమనార్హం. అనుమతి లేకుండా చెట్లు నరికేశారని విద్యుత్‌శాఖ, తహసీల్దార్, అటవీశాఖ, పోలీసుస్టేషన్, ఉద్యానవన అధికారులకు, కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో మూడు సార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని బాధితుడు మహేష్ వాపోతున్నాడు. అటవీశాఖ అధికారులు పరిశీలించి చెట్ల విలువను టింబర్ రేట్ ప్రకారం రూ.17వేలుగా నిర్ణయించారని, అక్రమంగా నరికినందుకు తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చేశారని తెలిపాడు. విద్యుత్ శాఖ అధికారులు తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి స్థానిక ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తీసుకొస్తున్నారని పేర్కొన్నాడు. నరికిన చెట్లు పొలంలోనే ఉండడంతో వరిసాగు చేసుకోవడం కష్టంగా మారిందని తెలిపాడు. ఏడాదికి రూ.లక్షలు ఆదాయం, వందేళ్ల దిగుబడి వచ్చే చెట్లను అన్యాయంగా నరికేశారని, న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పేలా లేదని పేర్కొన్నాడు.

కొమ్మలు నరికేశారు..

విద్యుత్ లైన్‌కు అడ్డుగా వస్తున్నాయి.. కొమ్మలు నరుకాలని ఏఈ సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించడంతో కొమ్మలు మాత్రమే నరికేశారు. చెట్లు నరకాలని చెప్పలేదు. చెట్లు ఎవరు నరికి వేశారో తెలియదు. బాధితుడు నా వద్దకు వచ్చి ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ కొనసాగుతోంది.
– గంగాధర్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి



ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ

దస్తురాబాద్: మండలంలోని గోడిసీర్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం.. గోడిసీర్యాల గ్రామానికి చెందిన గోసుకుల రాజేశ్ తన గ్రామంలో నూతన వాటర్ ప్లాంట్‌కు నిర్వహణ అనుమతుల కోసం శివకృష్ణను సంప్రదించాడు. రూ.15 వేలు డిమాండ్ చేయగా.. చర్చల అనంతరం రూ.12 వేలకు ఒప్పందం కుదిరింది. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో అనుమతి పత్రాలను శివకృష్ణ రాజేశ్‌కు ఇచ్చాడు. అనంతరం గ్రామ సమీపంలోని ఓనర్సరీలో రూ.12 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెండ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదుతోపాటు శివకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని ఆదిలాబాద్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ మధు తెలిపారు.